క్లుప్తంగా

194 మందికి వైద్య సేవలు



రఘుదేవపురంలో రోగులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: రఘుదేవపురం–3లో పీహెచ్‌సీ వైద్యుడు ఎస్.రాజు ఆధ్వర్యంలో 194 మందికి సోమవారం వైద్య సేవలు చేశారు. పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాలని జాగ్రత్తలను వివరించారు. పీహెచ్‌సీలో పాము, కుక్కకాటు మందులు అందుబాటులో ఉన్నాయని అన్నారు. వీటి విషయంలో అశ్రద్ధ చేయవద్దన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ చిన్నారి, ఏఎన్ఎం సంధ్య, ఆశ వర్కర్లు సాయి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుకు మొగ్గు



గుమ్ములూరులో మొక్కజొన్న ఏతల పనిలో వ్యవసాయ కూలీలు

మధురపూడి: కోరుకొండ మండలంలో మొక్కజొన్న సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇందులో భాగంగా 15 రోజుల నుంచి ఏతలు ప్రారంభమయ్యాయి. రబీలో వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటైన మొక్కజొన్నను రైతులు పండించేందుకు ఆసక్తి చూపుతున్నారు. మండలంలో ఖరీఫ్‌లో 5 వేల ఎకరాల్లో వరి సాగు అయ్యింది. అయితే రబీలో ప్రభుత్వం రైతన్నలకు మద్దతు ధరను అమలు చేస్తుందో లేదో అనే అనుమానాలు వచ్చాయి. దీంతో 70 శాతం విస్తీర్ణంలో మొక్కజొన్నను సాగు చేయాలని కర్షకులు నిర్ణయించారు. మునగాల, కోటి, మునగాల, బుచ్చెంపేట, గుమ్ములూరు. శ్రీరంగపట్నం తదితర గ్రామాల్లో మొక్కజొన్న సాగుకు నాట్లు వేస్తున్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు, అల్పాహార ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దాతలు

పెదపూడి: సమాజం పట్ల సేవాదృక్పథం కలిగి ఉండాలని అనపర్తి పాత ఊరు రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఆలయం వద్ద దాత కర్రి రామారెడ్డి దంపతులు, వారి కుమారుడు అరుణ్ స్వరూప్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది పేదలకు దుప్పట్లు, అల్పాహార ప్యాకెట్లు పంపిణీ చేశారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



ముగ్గళ్ల పొలంలో మృతి చెందిన శ్రీను

సీతానగరం: ముగ్గళ్లకు చెందిన మిరప శ్రీను (56) పంట పొలంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. సోమవారం ఉదయం 9 గంటలకు శ్రీను తన పొలంలో నీరు పెట్టడానికి వెళ్లాడు. పిసిని సూర్యనారాయణ సరిహద్దు పొలం నుంచి నీరు శ్రీను పొలంలోకి వస్తుంది. పొలం నుంచి బోదె ద్వారా వచ్చే నీటిని గమనిస్తుండగా విద్యుత్ స్తంభం నుంచి తీగ తెగి నీటిలో పడగా విద్యుత్ షాక్ తగిలి శ్రీను మరణించాడు. సూర్యనారాయణ మధ్యాహ్నం తన పొలం వద్దకు వెళ్లగా, రెండు కాళ్లు కాలిపోయి మృతి చెందిన శ్రీను కనిపించడంతో మృతుడి కుమారుడు రామారావుకు తెలిపాడు. సమాచారం అందుకున్న ఎస్సై డి.రామ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు.

అయ్యప్పస్వామి దశమ వార్షికోత్సవాలు

పెదపూడి: అనపర్తిలో వేంచేసి యున్న అయ్యప్పస్వామి దశమ వార్షికోత్సవ ఉత్సవాలు ఈనెల 17 నుంచి 21వరకు ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఆలయ ట్రస్ట్ నిర్వాహకులు తేతలి త్రినాథ్‌రెడ్డి, ద్వారంపూడి లీలాకృష్ణారెడ్డి, సబ్బెళ్ల సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ 19న నవకలశపూజ అభిషేకం, 20న పంచగవ్య శుద్ధి, 21న 1008 కలశాలతో కేరళ తాంత్రిక విధానంలో స్వామివారికి సహస్ర కలశాభిషేకం, మధ్యాహ్నం అన్న సమారాధన, సాయంత్రం పుష్పాభిషేకం ఉంటుందన్నారు.

కోదండరాముడికి పంచామృతాభిషేకం

పెదపూడి: సంపర కోదండరామాలయంలో కార్తికమాసం సోమవారం సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకాలు, హోమం, తర్పణం, తులసిపూజ ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

విజ్ఞానం.. వినోదం



గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులు



విద్యార్థులు తయారు చేసిన బొమ్మలు

- గ్రంథాలయ వారోత్సవాలకు విశేష స్పందన
- తరలివస్తున్న విద్యార్థులు, పాఠకులు
- హాజరవుతున్న పలువురు ప్రముఖులు
- తెలుగు, ఇంగ్లిష్ భాషలపై పట్టుకు ప్రత్యేక శిక్షణ

రంగంపేట: గ్రంథాలయ వారోత్సవాలకు విశేష స్పందన లభిస్తోంది. విద్యార్థులకు విజ్ఞానంతో పాటు వినోదం కూడా అందించడంతో ప్రతీరోజూ విద్యార్థులు, పాఠకులు తరలివస్తున్నారు. అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లోని అనపర్తి, రంగంపేట, బిక్కవోలు, రాజానగరం, సీతానగరంలోని శాఖా గ్రంథాలయాల్లో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ సగటున ఒక్కో గ్రంథాలయానికి 40 మందికి పైగా విద్యార్థులు, పాఠకులు వస్తున్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పద్య పఠనం, స్పోకెన్ ఇంగ్లీషు, ఆటలు, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ గ్రంథాలయ వారోత్సవాల్లో ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు సైతం పాల్గొంటూ విద్యార్థులకు అమూల్యమైన విశేషాలను వివరిస్తున్నారు. వారోత్సవాల్లోనే కాకుండా పాఠశాలలకు వేసవి సెలవుదినాల్లో సైతం ఈ శాఖా గ్రంథాలయాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. వారోత్సవాల్లో ప్రత్యేకంగా స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ ఇప్పించడం తమకెంతో ఉపయుక్తంగా ఉంటోందని విద్యార్థులు చెబుతున్నారు. కాంపిటేటివ్ పోటీపరీక్షలకు అవసరమయ్యే అన్ని రకాల పుస్తకాలు, మ్యాగ్‌జైన్లు అందుబాటులో ఉంచుతున్నారు. ఇవికాకుండా వారం రోజుల పాటు నిత్యం ఏదో ఒక అంశంపై పోటీలు నిర్వహించి ముగింపు రోజున బహుమతుల ప్రదానం చేసే ఏర్పాట్లు చేపట్టారు.

బొమ్మలు వేస్తున్నా



చిత్రలేఖనంపై ఆసక్తితో గ్రంథాలయానికి వెళుతున్నాను. వివిధ రకాల బొమ్మలు వేయడం నేర్చుకుంటున్నాను. పేపరుతో పలు రకాల ఆకృతులు తయారు చేయిస్తున్నారు. ఇంగ్లీషు, సైన్సు తదితర అంశాలపై ఎన్నో విషయాలు చెబుతున్నారు. ఇవి భవిష్యత్‌లో నాకు ఎంతో ఉపయోగపడతాయి.

– ఎం. దుర్గామహేశ్వరి, 9వ తరగతి, రంగంపేట

కథలంటే ఇష్టం



నాకు కథలంటే చాలా ఇష్టం. ఎంతో ఆసక్తి కలిగించే కథలు చెబుతున్నారు. కాగితంతో బొమ్మలు, డ్రాయింగ్ నేర్చుకుంటున్నాను. సులభంగా బొమ్మలు ఎలా గీయాలో చెబుతున్నారు. ఇలాంటి మెళకువలు తెలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది.

– కె.రోహిత్, 4వ తరగతి, రంగంపేట

విద్యార్థులకు ఎంతో మేలు



వారోత్సవాల్లోనే కాకుండా సెలవురోజుల్లో సైతం గ్రంథాలయంలో విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇంగ్లీషు, తెలుగు సబ్జెక్టులపై పట్టు సాధించే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం. పఠనానైపుణ్యం పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా శిక్షణ ఇస్తున్నారు. గ్రంథాలయాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.

– వి. పార్థసారథి, హెచ్‌ఎం, జెడ్పీపాఠశాల, రంగంపేట.

అపూర్వ ఆదరణ



గ్రంథాలయ వారోత్సవాలకు పాఠకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. అన్ని తరగతుల వారికి అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. విజ్ఞానంతో పాటు వినోదం అందించే కార్యకమాలు ఏర్పాటు చేస్తున్నాం. తెలుగు, ఇంగ్లీషు భాషలపై పట్టు సాధించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– ఎస్. రామకోటేశ్వరరావు, గ్రంథాలయాధికారి, రంగంపేట.

ముగ్గళ్లకు చేరుకున్న స్వాములు



స్వాములకు ఆహ్వానం పలుకుతున్న స్థానికులు

సీతానగరం: ముగ్గళ్ల నుంచి కాలినడకన శబరిమల వెళ్లిన అయ్యప్ప మాలధారులు గుర్రాల స్వామి, బత్తిన శ్రీను, బోండు భాను, దూలం రమణ, రుద్రం శ్రీను, ఉమ్మిడి బుల్లిరాజు సోమవారం ఉదయం స్వగ్రామానికి చేరుకున్నారు. సెప్టెంబర్ 28న ముగ్గళ్ల నుంచి శబరిమలకు పాదయాత్రగా బయలుదేరి 47 రోజుల్లో అక్కడకు వెళ్లారు. ఈ పాదయాత్రను ఐదు రోజులు వర్షం కారణంగా నిలిపివేశారు. ఈ నెల 16న అయ్యప్ప స్వామి దర్శనం అనంతరం సోమవారం ఉదయం ముగ్గళ్లకు చేరుకున్నారు. వీరికి స్థానికులు కూచిపూడి కోటేశ్వరరావు తదితరులు అభినందించారు.

స్పందనకు నాలుగు అర్జీలు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు వచ్చాయి. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనకు సీతానగరానికి చెందిన దివ్యాంగుడు మద్దాల రామకృష్ణబాబు వచ్చి తనకు జీవనోపాధి చూపాలని అర్జీ అందించారు. తాగునీటి సమస్యపై రఘుదేవపురానికి చెందిన వాడవెల్లి కృష్ణారావు, చినకొండేపూడి–నాగంపల్లి రోడ్డు మరమ్మతులు చేయాలని, జగనన్న కాలనీలో విద్యుత్ స్తంభం సరిచేయాలని గోపిశెట్టి అచ్చారావు అర్జీలు అందించారు.

హెచ్‌ఎంలే కీలకపాత్ర వహించాలి



మాట్లాడుతున్న ప్రాంతీయ విద్యా సంచాలకులు జోన్‌-2 నాగమణి

రాజానగరం: పాఠశాల నిర్వహణలో ప్రధానోపాధ్యాయులే కీలకపాత్ర వహించాలని ప్రాంతీయ విద్యా సంచాలకులు జోన్‌–2 జి.నాగమణి అన్నారు. మండలంలోని సాయిమాధవి ఇంజినీరింగ్ కళాశాల భవనంలో స్కూల్ లీడర్ షిప్ ట్రెనింగ్ ప్రోగ్రామ్, 2వ బ్యాచ్ శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు మాట్లాడుతూ బోధన విధానంలో వస్తున్న మార్పులను, సాంకేతికతను ఆకలింపు చేసుకుంటూ విద్యా బోధన చేయాలన్నారు. పాఠశాల సమగ్ర సమాచారం సంబంధిత హెచ్‌ఎం వద్ద అందుబాటులో ఉండాలన్నారు. సమగ్ర శిక్ష ఏపీసీ ఎస్.సుభాషిణి మాట్లాడుతూ ఆరు రోజులపాటు జరిగే ఈ శిక్షణకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 190 మంది హెచ్‌ఎంలు, ఎంఈఓలు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ జయశ్రీ, జిల్లా సమగ్ర శిక్ష ఏఎంఓ గౌరీశంకర్, సీఎంఓ శ్రీనివాసరావు, కాకినాడ, కోనసీమ జిల్లాల ఏఎంఓలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పడిపూజ



పడిపూజ చేస్తున్న అయ్యప్ప మాలధారులు

రాజానగరం: చక్రద్వారబంధంలో అయ్యప్ప దీక్షలో ఉన్న స్వాములతో సోమవారం రాత్రి పడిపూజ వైభవంగా జరిగింది. ఉదయం గణపతి హోమం, ఏకాదశి రుద్రాభిషేకం నిర్వహించి, మధ్యాహ్నం పేటతుళ్లి ఆడారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన స్వాములు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



రహదారి మధ్య అదుపు తప్పిన ట్రాక్టర్

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లి గ్రామంలో త్రుటిలో ప్రమాదం తప్పింది. సోమవారం ఓ గడ్డి ట్రాక్టర్ పంట చేను నుంచి రోడ్డు ఎక్కే క్రమంలో ఒక్కసారిగా అదుపు తప్పి పక్కనే ఉన్న పంట బోదెలోకి పడిపోయింది. డ్రైవర్ చాకచక్యంగా ట్రాక్టర్ కింద పడకుండా జాగ్రత్త పడ్డాడు. ఈ సంఘటనతో ఆ దారిలో వాహనాల రాకపోకలు కొంత సమయం పాటు నిలిచిపోయాయి.

ఇసుక తరలింపులో నిబంధనలు పాటించాలి



వంగలపూడి ఓపెన్ రీచ్‌ను పరిశీలిస్తున్న జేసీ చిన రాముడు

సీతానగరం: వంగలపూడి ఓపెన్ రీచ్ నుంచి నిబంధనలను పాటిస్తూ ఉచితంగా ఇసుకను తీసుకువెళ్లవచ్చని జాయింట్ కలెక్టర్ చిన రాముడు తెలిపారు. వంగలపూడి ఓపెన్ రీచ్ వద్దను ఆయన సోమవారం పరిశీలించారు. ర్యాంపు నిర్వాహకులకు, ట్రాక్టర్ డ్రైవర్ల మధ్య గిట్టుబాటు ధరపై తలెత్తిన వివాదాన్ని చర్చించి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ చర్చలు సఫలం కావడంతో మంగళవారం ఉదయం నుంచి ఇసుక తవ్వకాలు జరుపుతామని కూలీలు తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతం నుంచి ట్రాక్టర్‌పై స్టాక్ పాయింట్ వద్దకు ఇసుక తీసుకు రావడానికి రూ.150 చెల్లిస్తున్నారని, గిట్టుబాటు కావడం లేదని, ధర పెంచాలని మూడు రోజులుగా ఇసుక తవ్వకాలు నిలిపివేశారు. దీంతో తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ ఇరువర్గాలతో సంప్రదించి జేసీ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో జేసీ చినరాముడు వంగలపూడి రీచ్‌కు చేరుకుని ట్రాక్టర్ డ్రైవర్లతో మాట్లాడుతూ స్టాక్ పాయింట్ వద్దకు ఇసుక తరలింపునకు పది ట్రాక్టర్లకు ప్రభుత్వం అనుమతులు ఉన్నాయని, వాటిని ఎవరు నిలుపుదల చేయరాదని హెచ్చరించారు. ర్యాంపు నిర్వాహకులు, ట్రాక్టర్ డ్రైవర్లు సర్పంచ్ కొంచ అన్నపూర్ణ, కొంచ భాస్కరరావు తదితరులు ఇరువురితో చర్చించి ట్రాక్టర్‌కు రూ.175 ఇచ్చేలా, సంక్రాంతి సమయంలో మరికొంత నగదు పెంచే విధంగా చర్చలు సఫలమయ్యాయి. కార్యక్రమంలో వీఆర్వో బాబూరావు, ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులు, కూలీలు పాల్గొన్నారు.

పిల్లల దత్తతలో నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రాజ్‌కుమార్

రాజానగరం: సంతానం లేని దంపతులు వేరొకరి పిల్లలను దత్తత తీసుకోవాలంటే ప్రభుత్వం రూపొందించిన నిబంధనలను కచ్చితంగా పాటించాలని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సి.రాజ్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ దత్తత మాసోత్సవాలలో భాగంగా 'మాతృత్వం ఒక వరం– దత్తత దానికి మరొక మార్గం' అనే అంశంపై స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో కారా (సెంట్రల్ ఎడాప్షన్ రిసోర్సు అకాడమీ) ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనాధ పిల్లలను, బంధువుల పిల్లలను దత్తత తీసుకునే విధానంలో పాటించాల్సిన నిబంధనలను వివరించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ టి.నాగమణి, శిశు గృహ మేనేజర్ సుమలత, క్రాప్ కోఆర్డినేటర్ రాజ్‌కుమార్, సూపర్‌వైజర్లు ఎస్.కె. దుర్గామణి, ఎస్.భూదేవి, ఎస్.సింహాచలం పాల్గొన్నారు.

ఫార్మాసిస్టుల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి

రాజానగరం: దేశంలో ఫార్మాసిస్టుల పాత్ర ఎంతో కీలకమని రాజమహేంద్రవరం రూరల్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పి.కల్యాణి అన్నారు. ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ (ఐపీఏ), రాజమహేంద్రవరం శాఖ ఆధ్వర్యంలో గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ, వికాస్ ఫార్మసీల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ ఫార్మసీ వారోత్సవాలు గైట్‌లో సోమవారం ప్రారంభమయ్యాయి. పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకుంటూ ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించడంపై విద్యార్థులు దృష్టి కేంద్రీకరిస్తే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.రామచంద్రన్, మురళీధర్, అనిల్‌కుమార్, షేక్ మీరా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులు



సీతానగరం గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

సీతానగరం: స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ఉపాధ్యాయులు కె.విజయ్‌కుమార్, జి.అశోక్, జి.శేఖర్, ఎంవీవీ ప్రసాద్, ఎస్ఎస్‌బీటీ సుబ్రహ్మణ్యంలు గ్రంథాలయాల పాత్ర, ఉపయోగాలపై అవగాహన కల్పించారు.

రాజానగరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు దేశభక్తి గీతాలు, పద్యాలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు 20న జరిగే గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో సర్టిఫికెట్లు అందజేస్తామని లైబ్రేరియన్ కలగర సత్యనారాయణ తెలిపారు.

బిక్కవోలు: కొంకుదురులో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి ఎస్ బాల పాల్గొన్నారు.

పెదపూడి: విద్యార్థులు విద్యార్థి దశ నుంచి పోటీతత్వం అలవరుచుకోవాలని అనపర్తి కేపీ. జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.సుజాత అన్నారు. పాఠశాలలో సోమవారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుతులు అందజేశారు. గ్రంథాలయాధికారి జి.అభిలాష్ పాల్గొన్నారు. పెదపూడిలో గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ అధికారి హర్షవర్ధన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసచరన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ పూర్తి చేయాలి



కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేంద్రరెడ్డి

పెదపూడి: రెవెన్యూ గ్రామ పంచాయతీ, గ్రామాల శివారు హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి సూచించారు. ఆయన మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సచివాలయ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం చర్యలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పరిశుభ్రమైన తాగునీరు ప్రజలకు సరఫరా చేయాలన్నారు. ఇంటి పన్నుల వసూలు, సర్వేల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. అపార్ ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ త్వరగా పూర్తి చేయడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మేడపాటి సత్యనారాయణరెడ్డి, ఏపీఓ సత్యనారాయణ, సచివాలయం కార్యదర్శులు యాళ్ల ఉమా మహేశ్వరరావు, మన్యం శ్రీనివాసు చౌదరి, సుంకర వీరస్వామి, బి.ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరమేశ్వరా.. పాహిమాం



పందలపాకలో దీపాలంకరణ చేస్తున్న భక్తులు

బిక్కవోలు: కార్తికమాసం మూడవ సోమవారం సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల కొలువులు భక్తులతో కిటకిటలాడాయి. బిక్కవోలు శ్రీ గొలింగేశ్వర స్వామి, పందలపాక శ్రీ గౌరీశంకర ఆలయం, శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, కొంకుదురు శ్రీ బాలా త్రిపుర సమేత త్రిముఖ లింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు.

కోటి దీపోత్సవ కాంతులు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాల గ్రామంలో సోమవారం రాత్రి కోటి దీపోత్సవం వైభవంగా జరిగింది. కార్తిక మాసం సందర్భంగా మహిళలు భక్తి శ్రద్ధలతో దీపాలు వెలిగించారు. అడ్డాల శివసూర్య చక్రవర్తి దంపతుల ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు శివపూజ చేశారు. అనంతరం అన్నసమారాధనను నిర్వహించారు. సాయంత్రం రాపర్తి ప్రసాద్‌శర్మ శివారాధన, కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. రాత్రి 8 గంటలకు మణికంఠ, సాయి స్వాములచే పడిపూజ జరిగింది. తొలుత విఘ్నేశ్వరునికి, సుబ్రహ్మణ్యేశ్వరుని స్వాములు పూజలు నిర్వహించారు. సహస్రనామాలు, అష్టోత్తర అర్చనలు, అయ్యప్ప భజనలు జరిగాయి. రాత్రి అఖండ హారతి భక్తులను ఆకర్షించింది.

రాజానగరం: స్థానిక జాతీయ రహదారి పక్కన నరేంద్రపురం జంక్షన్‌లో కొలువైన ఈతచెట్టు పరమేశ్వరుడిని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ దర్శించుకున్నారు. మధురపూడి ఎయిర్‌పోర్టు నుంచి కాకినాడకు వెళ్తూ ఇక్కడ కొద్దిసేపు ఆగి, పూజలు చేశారు.

వైభవంగా లక్షబిల్వార్చన

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలోని శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద అర్చకులు రమణశర్మ ఆధ్వర్యంలో12 మంది రుత్వికులతో గ్రామానికి చెందిన గొలుగూరి వెంకటరెడ్డి, గొలుగూరి వెంకటరామారెడ్డి దంపతులు లక్షాబిల్వార్చన నిర్వహించారు. కార్తికమాసం మూడో సోమవారం కావడంతో ఆలయం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన, దీపాలంకరణ చేశారు.అనంతరం అన్నసమారధన నిర్వహించారు.

మధురపూడి: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని రుడా చైర్మన్‌గా ఎంపికైన బొడ్డు వెంకటరమణ చౌదరి దర్శించుకున్నారు. అనంతరం కార్తిక మాసం సందర్భంగా నిర్వహిస్తున్న అన్న సమారాధనలో భక్తులకు ప్రసాదం వడ్డించారు.

ఘనంగా కార్తిక వనసమారాధన

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు బుడిత మామిడి వద్ద ఘనంగా కార్తిక వనసమారాధన నిర్వహించారు. కార్తికమాసం మూడవ సోమవారం కావడంతో బాలా త్రిపుర సుందరీ సమేత త్రిముఖ లింగేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కొంకుదురు గ్రామానికి చెందిన కొవ్వూరి చిన్నవెంకటరెడ్డి, సత్తి వెంకటరాయుడుల కుటుంబ సభ్యులు ఈ వనసమారాధన నిర్వహించారు.